సాక్షి
పెద్దపల్లి
ఆదివారం। 10 । డిసెంబర్ । 2023

అసాధారణ అతివలు



జిల్లాకో ప్రత్యేకత ఉంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారులు విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో మొత్తం 7,11,727మంది ఓటర్లు ఉండగా, ఇందులో 3,57,722 మంది మహిళలు ఉన్నారు. పురుషులు 3,53,953 మంది ఉన్నారు. మిగతా వారు ఇతరులు. అయితే, పురుషులకన్నా మహిళా ఓటర్లు 3,769మంది అధికంగా ఉన్నారు. అంతేకాదు.. మొన్నటి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ, ఎంతో సహనంతో సున్నితమైన ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసి కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ ప్రశంసలు అందుకున్నారు. ఎన్నికల్లో పాలుపంచుకున్న మహిళా అధికారుల ఆదర్శంగా కథనం.. - జ్యోతినగర్(రామగుండం)

8లో

అండగా ఉంటాం | అభివృద్ధి చేస్తాం

కార్యాచరణతో ముందుకు



మంథని ప్రాంత అభివృద్ధి, సంక్షేమంపై ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగుత. పెండింగ్ పనులతో పాటు మేనిఫెస్టోలో పెట్టిన ప్రధానమైన అంశాలను నియోజకవర్గానికి పెద్ద స్థాయిలో తీసుకువచ్చే విధంగా కృషిచేస్తా. నిరంతరం నా ప్రయత్నం కొనసాగుతుంది. ఈప్రాంత సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్తా.

– దుద్దిళ్ల శ్రీధర్, మంథని ఎమ్మెల్యే, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

సమస్యలు పరిష్కరిస్తా



పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా. ప్రజా అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యమిస్తా. బస్ డిపో ఏర్పాటు, ప్రధాన కూరగాయల మార్కెట్ అభివృద్ధి తదితర సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల ఫలాలను అందిస్తా.

– విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



- ప్రమాణ స్వీకారం చేసిన 11 మంది జిల్లా ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని ప్రతిన
- వివిధ కారణాలతో కార్యక్రమానికి కేటీఆర్, పాడి కౌశిక్ దూరం
- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి మక్కాన్ సింగ్
- తిరిగి పాత జిల్లాకే దక్కిన ఐటీ, బీసీ శాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో లాంఛనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాత జిల్లాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాగా, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలను 'సాక్షి' పలకరించింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామని.. పార్టీ మేనిఫెస్టో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ సమస్యలకు పెద్దపీట వేస్తామని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యేలలో కోరుట్ల నుంచి సంజయ్, ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం నుంచి మక్కాన్ సింగ్, వేములవాడ నుంచి ఆది శ్రీనివాస్, చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం, మానకొండూరు నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్, పెద్దపల్లి నుంచి చింతకుంట విజయరమణారావుకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉంది. శ్రీధర్‌బాబు, గంగుల కమలాకర్ మంత్రులుగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా.. వ్యక్తిగత కారణాలతో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సాంకేతిక సమస్యలతో పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు ఐటీ శాఖ కేటాయించారు. అయితే గతంలో ఇదే శాఖను సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించిన కేటీఆర్ నిర్వహించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంక్షేమశాఖ వరించింది. ఈ శాఖను గతంలో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన గంగుల కమలాకర్ నిర్వహించారు. ఏదేమైనా రెండు కీలక శాఖలు తిరిగి పాత జిల్లాకే దక్కడం విశేషం.

తట్టా చెమ్మస్‌తో.. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

తట్టా చెమ్మస్‌తో బ్లూకలర్ డ్రెస్‌తో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అసెంబ్లీకి రావడం అందరి దృష్టిని ఆకర్షించారు. తాను కూడా సింగరేణి కార్మికుడినని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే అసెంబ్లీకి రావడం కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. అవే దుస్తులతో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడాన్ని రామగుండం ప్రజలు, సింగరేణి బెల్ట్ కార్మికులు స్వాగతించారు.

హామీలు నెరవేరుస్తా..



అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీల అమలు మొదలైంది. ఆరు గ్యారెంటీలలో కీలకమైన మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. నన్ను గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా.

– పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమశాఖ మంత్రి

కార్మికులకు రక్షణగా ఉంటా



సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా. రామగుండం నియోజకవర్గ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. సింగరేణితోపాటు స్థానిక సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తా. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

– రాజ్ ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

యాదాద్రి తరహాలో చేస్తా..



మేడారం, కాళేశ్వరం లింక్–2 ద్వారా ఈప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు వచ్చేలా చూస్తా. జంగల్‌నాలా ప్రాజెక్టుకు లింక్–2 ద్వారా తూము ఏర్పాటు చేస్తాం. ధర్మపురి పట్టణంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు, ధర్మపురిలో బస్‌డిపో ఏర్పాటు రెవెన్యూ డివిజన్ హోదా, యాదాద్రి తరహాలో అభివృద్ధికి కృషి చేస్తా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే

ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కృషి



జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు ఇప్పటికే వెయ్యికోట్లతో అభివృద్ధి చేసుకున్నాం. ఫుడ్ ఇండస్ట్రీతో పాటు పెండింగ్‌లో ఉన్న మెడికల్ కాలేజీ పూర్తిస్థాయి పనులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా. సారంగాపూర్ మండలం గొల్ల వాగు ప్రాజెక్టు పూర్తయింది. అటవీశాఖ అనుమతితో గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మెజార్టీ గ్రామాల్లో సీసీ రోడ్లు వేశాం, వేయని వాటిలోనూ పూర్తి చేస్తాం.

– సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

పరిశ్రమల స్థాపనకు..



కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచి గల్ఫ్ వలసలు నివారించడంపై దృష్టి పెడతా. మున్సిపాలిటీలను ఇప్పటికే అగ్రగామిగా నిలపాం. వాటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం. నియోజకవర్గంలో పీజీ కళాశాలలు, సీటీ స్కాన్ సెంటర్, పేదలకు ఇళ్ల నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే

టెంపుల్ సిటీగా మారుస్తా..



అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెడతా. వేములవాడ నగరాన్ని టెంపుల్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తా. నియోజకవర్గ సమస్యలతోపాటు ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. స్థానిక సమస్యలపై అవగాహన మేరకు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలు నాపై పెట్టుకున్న ఆశలను నిలబెట్టుకుంటా.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

అభివృద్ధే ధ్యేయం



ఎన్నికల్లో నన్ను గెలిపించిన చొప్పదండి ప్రజలకు రుణపడి ఉంటాను. పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చడం ఇప్పటికే మొదలైంది. స్థానికంగా ఇచ్చిన హామీలపై దృష్టి పెడతాం. ప్రాధాన్య క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం. మౌలిక సదుపాయాలతోపాటు అన్నిరంగాల్లో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం.

– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా..



రహదారుల అభివృద్ధి కోసం నిధులు తీసుకొస్తా. నియోజకవర్గంలో పదేళ్లుగా ఇళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తా. తాగు సాగునీరు సదుపాయాలతోపాట మౌలిక వసతుల కల్పనకు కషి చేస్తా. గ్రామాల్లో సీసీ రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తా.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

భావితరాల కోసం పాటుపడతా



కరీంనగర్‌ను అన్ని రంగాల్లో తీర్చిదిద్దా. స్మార్ట్‌సిటీ, ఎంఆర్ఎఫ్ ప్రాజెక్టు, కేబుల్ బ్రిడ్జితో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేశాం. టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరాలయం పూర్తిచేసి ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తాం. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కొత్త పనులు ప్రారంభిస్తా.

– గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే

ప్రయాణం.. ఉచితం

- మహాలక్ష్మి పథకానికి అనూహ్య స్పందన
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళా ప్రయాణికులు
- ఆర్టీసీలో ప్రారంభమైన కొత్త పథకం

గోదావరిఖనిటౌన్/మంథని/సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం ప్రారంభించిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని గోదావరిఖని, మంథని, పెద్దపల్లి బస్టాండ్‌లలో అధికారులు లాంఛనంగా ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి) పథకం ప్రారంభించారు. తొలిరోజే పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణంచేశారు. ఇందులో కొందరు మహిళలను పలుకరించగా ఆనందం వ్యక్తం చేశారు. వారి మాటల్లోనే..

ఖని డిపోలో..

ఖని డిపోలో పల్లెవెలుగులు 30 వరకు ఉన్నాయి. అద్దె బస్సులు 31 నడుస్తున్నాయి. అదేవిధంగా సిటీ బస్సులు 15, ఎక్స్‌ప్రెస్‌లు 9, అద్దె బస్సులు 9, ఆర్టీసీ సూపర్ లగ్జరీలు 16, గరుడలు 2, రాజధాని ఏసీలు 5 బస్సులు నడుస్తున్నాయి. రోజు సుమారు 42 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. వీరిలో 16 వేల నుంచి 20వేల మంది మహిళలు, దాదాపు 5 వేల మంది విద్యార్థులు ఉఉన్నారు. రోజూ ఆదాయం సుమారు రూ.20లక్షల నుంచి రూ.24లక్షల వరకు సమకూరుతోంది.

మంథనిలో..

మంథని డిపోలో పల్లెవెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి 24 ఉన్నాయి. సూపర్ లగ్జరీలు 4 నడుస్తున్నాయి. రోజూ సుమారు రూ.9లక్షల ఆదాయం వస్తోంది.





బస్సులో ప్రయాణం చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పోస్టర్ విడుదల చేస్తూ..

ప్రయాణికుల సేవలో ఆర్టీసీ



మంథని ఆర్టీసీ డిపో పరిధిలో రోజూ సుమారు 14వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

– రాజశేఖరం, డీఎం, మంథని

నిర్ణయం మంచిదే



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడం మంచిదే. దీని ద్వారా పేదలకు ఆర్థిక భారం తగ్గుతుంది. సర్కారుకు మంచిపేరు వస్తుంది.

– సాయిరి పద్మ, సుల్తానాబాద్

మాట నిలబెట్టుకున్నరు



నా జీవిత కాలంలో ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడం ఇది మొదటిసారి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నరు.

– వెంగళ లక్ష్మి, సుల్తానాబాద్

సంబురంగా ఉంది



పైసలు లేకుండా ఊరికి పోవుడు ఇదే మొదలు. సంబురంగా ఉంది. నా పిల్లల దగ్గరికి నెలకోసారి రావచ్చు, పోవచ్చు. కాంగ్రెస్ సర్కారుకు మొక్కాలే.

– ముత్యాల లచ్చవ్వ, జమ్మికుంట

బస్‌పాసు బాధ లేదు



కాలేజీకి రోజూ వచ్చిపోతున్న. బస్సుపాసుకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్న. ఇప్పుడా బాధ లేదు. ఈరోజు నుంచి ఉచిత ప్రయాణమే.

– మానస, డిగ్రీ, ఈసంపేట

ఇబ్బంది లేదు



బస్‌పాస్‌కు పైసలు చెల్లించడం ఇబ్బందిగా ఉండేది. బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇక ఆర్థిక ఇబ్బందులు ఉండవు.

– కోమలత, డిగ్రీ, పొట్యాల

ఉద్యోగులకు ప్రయోజనం



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఉద్యోగులు, విద్యార్థినులకు ఆర్థిక భారం తగ్గిస్తుంది. ఇది గొప్ప వరం.

– బి.అనురాధ, టీచర్, గోదావరిఖని

ఆర్టీసీ ఆదాయం తగ్గుతుంది



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా రోజూ రూ. 8లక్షల వరకు ఆదాయం తగ్గుతుంది. ప్రభుత్వం చెల్లిస్తుంది.

– నాగభూషణం, డీఎం, గోదావరిఖని

న్యూస్‌రీల్

సృజనాత్మకత వెలికి తీయండి



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జీఎం ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థుల సృజనాత్మకతకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఉపయోగపడతాయని, వీటిని వేదికగా చేసుకుని తమలోని ప్రతిభన వెలికి తీయాలని ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర ఠాకూర్ సూచించారు. స్థానిక సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శనివారం జరిగిన సైన్స్ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, ప్రిన్సిపాల్ జ్ఞానసింగ్, ప్రధానోపాధ్యాయురాలు ఆర్ఎస్‌జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



సిద్దిపల్లెలో ధాన్యం కుప్పలు

కమాన్‌పూర్(మంథని):కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగుగా చిరుజల్లులు కురవడంతో ధాన్యం సేకరణ నిలిపివేశారు. ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే, తేమతో ఉన్న వడ్లను ఆరబెట్టడంలో రైతులు నిమగ్నమయ్యారు.

ఆలస్యంగా నడిచిన సింగరేణి రైలు

ఓదెల(పెద్దపల్లి): భద్రాచలం రోడ్డు నుంచి బల్లార్షా వెళ్లాల్సిన సింగరేణి రైలు శనివారం ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం 10.50గంటలకు ఓదెలకు చేరాల్సిన రైలు.. మధ్యాహ్నం 1.30 గంటలకు రావటంతో జమ్మికుంట, బిసిగిరిషరీఫ్, పొత్కపల్లి, ఓదెల, కొలనూర్, పెద్దపల్లి, రాంగుండం రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు గంటల కొద్దీ నిరీక్షించారు. భద్రాచలం నుంచి బల్లార్షా వరకు నడిచే ఏకైక రైలు కావడంతో వేలాది మంది దాని రాక కోసం నిరీక్షించి ఇబ్బందులు పడ్డారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



ఆనంది

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనందిని హన్మకొండలో ఇటీవల నిర్వహించిన అండర్–14 ఆరు వందల మీటర్ల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. ఆమె ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కమాన్‌పూర్ లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి తదితరులు అభినందించారు.

గురుకుల ప్రిన్సిపాల్ ఆకస్మిక బదిలీ

మంథని: మున్సిపల్ పరిధిలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సరితను కరీంనగర్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వ మైనార్టీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి బి.శఫియుల్లా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. సరిత రెండున్నరేళ్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె పలు ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులు అందించారు. ఈమేరకు సరితను బదిలీ చేశారు. అదేపాఠశాలలోని ఎస్జీటీ స్వప్నకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

అవినీతిపై పోరాటం

పెద్దపల్లిరూరల్: సహజ సంపదల దోపిడీని అడ్డుకోవడంతోపాటు బెల్ట్‌షాపులను మూసివేసేందుకు బీఎస్పీ పోరాటం సాగిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటిదాక సాగిన మట్టి దందా, ఇసుక మాఫియా ఆగడాల వివరాలను బయటకు తేవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేగా ఎన్నికైన విజయరమణారావుపై ఉందన్నారు. కుటీరపరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలు, యువకులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేసి బస్సు సౌకర్యాన్ని అన్ని ఊళ్లకు కల్పించాలన్నారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, నాయకులు వెంకటేశ్, పూరెల్ల స్వప్న, బొంకూరి దుర్గయ్య, సాతూరి అనిల్, రామిండ్ల శారద, ఈర్ల కొమురయ్య పాల్గొన్నారు.

అసాధారణ అతివలు

- సహనం వారి సొంతం
- సమన్వయం వారి ప్రత్యేకత
- పక్కా ప్రణాళికతో విధుల నిర్వహణ
- అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో సక్సెస్
- మహిళా అధికారుల ఆదర్శం

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ఒక పెద్ద సవాల్ లాంటిది. చట్టాలను రూపొందించి, ప్రజలకు చక్కని పాలన అందించే మంచి ప్రజాప్రతినిధిని ఎన్నుకునే ప్రక్రియ. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని అవలీలగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించారు జిల్లాలోని వివిధ విభాగాల మహిళా అధికారులు. శాంతిభద్రతల నుంచి పోలింగ్ నిర్వహణ, ఫలితాల వెల్లడి వరకూ అన్ని ప్రక్రియల్లోనూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగారు. అంతకుమించి ఎలాంటి సమస్య ఎదురైనా ఎంతో సహనం ప్రదర్శించారు. మిగతా విభాగాలను చక్కగా సమన్వయం చేసుకుంటూ లక్ష్యం చేరుకుని ఔరా అనిపించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. వారి గురించి ఈ వారం ప్రత్యేక కథనం.. వారి మాటల్లోనే..

స్ఫూర్తి



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నుంచి ప్రశంసలు అందుకుంటున్న ఎన్నికల అధికారులు

సమర్థవంతంగా విధులు



నామినేషన్, ఓటరు జాబితా, దరఖాస్తుల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియలో కీలకంగా పనిచేశాం. ఈవీఎంల పర్యవేక్షణ, సీఆర్‌పీఎఫ్ బలగాలు, చెక్‌పోస్టుల నిర్వహణ, పర్యవేక్షణ, కంట్రోల్‌రూమ్, హెల్ప్‌లైన్ తదితర అతికీలక వ్యవహారాలు చక్కగా నిర్వర్తించాం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వరుస సంఖ్య, సెక్టార్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వేర్స్, పీవో, ఏపీవోల నియామకం, ఈవీఎంల ర్యాండమైజేషన్, కమిషనింగ్‌పై దృష్టి సారించాం. అధికారులను అప్రమత్తం చేశాం.

– అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్

నేపథ్యం..
జగిత్యాల జిల్లా కొండాపూర్ పట్టణానికి చెందిన జల్ద అరుణశ్రీ 2012 గ్రూప్–1 ద్వారా కరీంనగర్ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నిర్మల్ ఆర్డీవోగా, జగిత్యాల అదనపు కలెక్టర్‌గా సేవలు అందించారు. 2018లో పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా విధుల్లో చేరారు.

అనుక్షణం అప్రమత్తం



పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రామగుండం పోలీసు కమిషనేట్ విస్తరించి ఉంది. 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలీసు బలగాల మోహరింపు, పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాం. అనుక్షణం అప్రమత్తంగా ఉన్నాం. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన వారినీ అప్రమత్తం చేశాం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాం

– రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్, రామగుండం

నేపథ్యం
కేరళకు చెందిన సీపీ రెమా రాజేశ్వరి ఎంటెక్ పూర్తిచేశారు. సివిల్స్ ప్రిపేరయ్యారు. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యారు. నల్గొండ ఎస్పీగా, యాదాద్రి జిల్లా డీఐజీగా సేవలు అందించారు.

ఉల్లంఘనలు లేవు



జిల్లాలో పోలింగ్ సజావుగా నిర్వహించాం. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, భద్రత, అసాంఘిక కార్యకలాపాలకు చోటులేకుండా చర్యలు తీసుకున్నాం. అధికారులను అప్రమత్తం చేశాం. పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వర్తించేలా చూశాం.

– డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి

నేపథ్యం..
హైదరాబాద్‌కు చెందిన చేతన.. పెద్దపల్లి డీ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె మెడిసిన్ చేశారు. 2010 ఐఆర్‌ఎస్ కస్టమ్స్ ఇన్ ఎక్సైజ్ పూర్తిచేశారు.

కంటిమీద కునుకు లేకుండా పనిచేశాం





అసెంబ్లీ ఎన్నికల విధులకు 80 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ 213 మహిళా బెటాలియన్ నాగపూర్ నుంచి వచ్చింది. రామగుండంలో ఎన్నికల భద్రత విధులు నిర్వహించాం. వెస్ట్ బెంగాల్, త్రిపుర, కర్ణాటక, జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్ వంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే ఎంతో చాకచక్యంగా విధులు నిర్వహించాం. ఆ అనుభవంతనే రామగుండం నియోజవర్గ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించాం. ఎన్నికల కమిషన్ నియమాల ఉల్లంఘనలు అరికట్టాం. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించాం. శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగాం. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద వాహనాలుతనిఖీ చేశాం. స్ట్రాంగ్ రూంల పర్యవేక్షణలోనూ మేం కీలకంగా వ్యవహరించాం. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పురుషులకు సరిసమానంగా, ధీటుగా బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు సాగాం.

– మీరాదేవి, అసిస్టెంట్ కమాండెంట్, 213 మహిళా బెటాలియన్, నాగపూర్ బ్యాచ్

నేపథ్యం..
ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరానికి చెందిన మీరాదేవి డిగ్రీ పూర్తిచేశారు. 1995 సీఆర్‌పీఎఫ్ బ్యాచ్ ద్వారా దేశ సేవ ఎంపికయ్యారు. సైనిక శిక్షణ క్రీడావిభాగంలో 2009 వాటర్ రోయింగ్ క్రీడలో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్, అంతర్జాతీయ స్థాయిలో 4వ స్థానం సాధించారు. 29 సంవత్సరాల అనుభవంతో భవిష్యత్ తరాల మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

అవగాహన కల్పించాం



ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అత్యవసర ఉద్యోగులు, ఇతర అధికారులు పోలీసులకు పోస్టల్ బ్యాలెట్, ఫారం–12, 12డి ద్వారా దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చాం. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ వందశాతం పూర్తిచేశాం.

– జ్యోతి, తహసీల్దార్, పాలకుర్తి

నేపథ్యం..
జగిత్యాల జిల్లాకు చెందిన జ్యోతి 2009 గ్రూప్–2 ద్వారా ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

చైతన్య పర్చాం



పోలింగ్ శాతం పెంచేలా ఓటర్లను చైతన్యపర్చాం. ఇందకోసం సమావేశాలు, ర్యాలీలు చేపట్టాం. ఇందుకోసం కళాకారుల సేవలు వినియోగించాం. ఓటుహక్కు వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించాం.

– గాండ్ల స్వరూపరాణి, సీడీపీవో, రామగుండం

నేపథ్యం..
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన స్వరూపరాణి ఎంఏ,బీఈడీ పూర్తిచేశారు. 2014లో ఏపీపీఎస్సీలో ఫస్ట్ ర్యాంక్ సాధించి సీడీపీవోగా నియమితులయ్యారు.

నిరంతర తనిఖీలు



చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీ చేశాం. పోలీసులను మోహరించాం. అనుమతి లేని నగదు, మద్యం, వస్తు సామగ్రి జప్తు చేశాం. ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి సలహాలు, సూచనలతో ముందుకెళ్లాం.

– శరణ్య, ఎస్సై, గోదావరిఖని వన్‌టౌన్

నేపథ్యం..
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన శరణ్య, ఎంఏ జర్నలిజం పూర్తిచేశారు. 2020లో ఎస్సైగా ఎంపికయ్యారు.

సమాచారం పంచుకున్నాం



మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారిగా నామినేషన్ ప్రక్రియ నుంచి ఓటరు జాబితా తయారీ, సమావేశాల నిర్వహణ, పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియాకు సమచారం చేరవేస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాం.

– బత్తుల రజని, మెప్మా అర్బన్ పీడీ

నేపథ్యం:
గోదావరిఖనికి చెందిన రజని ఎంఏ(ఎకనామిక్స్), ఎంఫిల్(పీహెచ్‌డీ) పూర్తిచేశారు. 2018లో మెప్మా డీఎంసీగా బాధ్యతలు చేపట్టారు. 2021లో ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్బన్ డీసీఎంగా పదోన్నతి పొందారు.

క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీలో చేరిక

రామగిరి(మంథని): ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2కు చెందిన టీబీజీకేఎస్ సీనియర్ నాయకుడు ఎల్లంకి రామరావుతోపాటు సుమారు 50 మంది కార్మికులు శనివారం ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఓసీపీ–2 పిట్ సెక్రటరీ ఉయ్యాల కుమార్‌స్వామి, బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య, నాయకులు కంది రవి, రాజ్‌కుమార్, ఓదేలు, వెంకటస్వామిగౌడ్ ఉన్నారు.

'రాజకీయ జోక్యం వద్దు'

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. నాయకులు ఎల్.ప్రకాశ్, రాజరత్నం, ఎజ్జ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

గోదావరిఖని: సింగరేణి సంస్థకు రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబీకేఎంఎస్ కార్యవర్గ సభ్యుడు మండ రమాకాంత్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియా మాదిరిగా అలవెన్సులపై ఆదాయపన్ను రద్దు, రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, పొన్నమనేని వేణుగోపాలరావు, వై.సారంగపాణి, పెండం సత్యనారాయణ, చిర్ర ఆంజనేయులు, యాదగిరి నరేశ్, ముదాం సత్తయ్య, లింగం నాయక్, ముత్యాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గోదావరిఖని: గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ యూనియన్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరారు. శనివారం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. బొగ్గు గని కార్మికుల చరిత్రలో 11వ వేజ్‌బోర్డు చరిత్రాత్మకమైందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంస్థ సంరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. నిజాయితీగా పనిచేసే కార్మిక సంఘం బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, వై.సారంగపాణి, ఆకుల హరిణ్, మాదాసి రవీందర్, గాజుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షలు వడ్డీలేని రుణం ఇప్పిస్తామన్నారు. నర్సింహారెడ్డి, ధర్మపురి, సదానందం, వికాస్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

ఒక్కొక్కరుగా రాజీనామా!

- బీఆర్‌ఎస్‌కు రెండు పదవులు దూరం
- ఎమ్మెల్సీ పదవికి పాడి కౌశిక్‌రెడ్డి రాజీనామా
- వ్యవసాయ ముఖ్య సలహాదారు పోస్ట్ రద్దు చేసిన సీఎం
- గతంలోనే రాజీనామా చేసిన రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్
- జీవన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్ ఓడినా పదవుల్లోనే..

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీఆర్‌ఎస్ మరో రెండు పదవులు కోల్పోయింది. ఇందులో ఒకటి మండలిస్థానం కాగా, మరొకటి నామినేటెడ్ పోస్టు కావడం గమనార్హం. హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈమేరకు తన రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా సమర్పించడం కోసం తన ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌కు శస్త్ర చికిత్స ఉన్న నేపథ్యంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కూడా ప్రమాణ స్వీకారం చేయలేదు. వీరిద్దరూ, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి మరో తేదీన ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం.

బీఆర్‌ఎస్‌కు మరో షాక్
అదే సమయంలో మధ్యాహ్నానికి ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు కీలక విభాగాలలో నియమించుకున్న సలహాదారుల పోస్టులను రద్దు చేస్తూ తాజా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు జాబితాలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కూడా ఉన్నారు. గతంలో పౌరసత్వ సమస్య ఉన్న కారణంగా ఆయనకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీపార్టీ టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన అనుచరులను సంతృప్తి పరిచేందుకు, సేవలను పార్టీ వినియోగించుకునేందుకు కేబినెట్ హోదాకు సమానమైన వ్యవసాయశాఖ ముఖ్య సలహాదారుగా నియమించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇంతకాలం కంటితుడుపుగా ఉందనుకున్న పోస్టు కూడా తాజా ప్రభుత్వం నిర్ణయంతో దూరమైంది. ఇటీవల ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి చెందిన దరిమిలా సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి సర్దార్ రవీందర్‌సింగ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీటుకు అనిల్ కుర్మాచలం రాజీనామా సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ కోల్పోయిన పదవుల సంఖ్య నాలుగుకు చేరింది.



రాజీనామా సమర్పిస్తున్న పాడి, కేసీఆర్‌తో రమేశ్‌బాబు

ఓడినా పదవుల్లో ఉండేది వీరే...
ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీకి పోటీ చేసిన పలువురు స్థానికసంస్థలు, చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రజాప్రతినిధులు ఓటమి చెందారు. వారిలో పాడి కౌశిక్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా వారి పదవుల్లో కొనసాగనున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కోరుట్ల అభ్యర్థిగా ఓడిన నిజామాబాద్ ఎంపీ డి.అర్వింద్ ఎంపీలుగా కొనసాగనున్నారు. వీరిద్దరూ ఇప్పటికే ఎంపీలుగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇక రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి జెడ్పీటీసీగా, మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కొనసాగుతారు. జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఎమ్మెల్సీగా మరో ఏడాదిన్నర కాలముంది.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఆర్టీసీలో మహాలక్ష్మి ప్రారంభం
- రూ.10 లక్షల 'ఆరోగ్యశ్రీ సేవలు' మరూ

కోల్‌సిటీ(రామగుండం): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శనివారం రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరితో కలిసి చేయూత, మహాలక్ష్మి పథకాలు ప్రారంభించి మాట్లాడారు. చేయూత ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని, ఇందులో 1,600 రకాల వ్యాధులకు 1,300 ఎంపానల్మెంట్ ఆస్పత్రులలో వైద్యచికిత్సలు అందుతాయన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఇకనుంచి రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికూనా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. అనంతరం మహాలక్ష్మి, చేయూత పథకాల ప్రచార పోస్టర్లను కలెక్టర్, సీపీ ఆవిష్కరించారు. సీపీతోపాటు కలెక్టర్ ఆర్టీసీ బస్సులో కొంత దూరం ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, కృపాబాయి, ఆర్టీవో రంగారావు, ఆర్టీసీ డీఎం నాగభూషణం, ఆరోగ్యశ్రీ ప్రతినిధి సతీశ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ తదితరులు

మార్కెట్ పాలకమండలి సమావేశంపై రగడ

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సమావేశాన్ని శనివారం చైర్మన్ జడల సురేందర్, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్ ఏర్పాటు చేయడం వివాదస్పదమైంది. ఇంతకాలం నిర్వహించిన ప్రతీ సమావేశానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన చైర్మన్, కార్యదర్శి.. కొత్త ఎమ్మెల్యే విజయరమణారావుకు ఈ సమాచారం ఎందుకు ఇవ్వలేదని మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, సర్పంచ్ ఆడెపు వెంకటేశం, నాయకులు ముదుసు సాంబిరెడ్డి, గంట రమేశ్ తదితరులు కార్యదర్శిని నిలదీశారు. ఇంత అత్యవసరంగా సమావేశాన్ని నిర్వహించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఇదివరకే పాలకమండలి సమావేశాన్ని నిర్వహించాలనుకున్నామని, ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మిన్నకుండిపోయామని అన్నారు. కోడ్ ఎత్తివేసిన తర్వాత అప్పటి సమావేశాన్నే చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేశారని కార్యదర్శి వివరించారు. మార్కెట్ పాలకమండలి సమావేశం ఏర్పాటు విషయమై కాంగ్రెస్ నాయకులు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని చైర్మన్ జడల సురేందర్ అన్నారు. తాము ప్రభుత్వ నిబంధనల మేరకే సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు.

బొగ్గు బాయి వార్తలు

ఐఎన్‌టీయూసీని గెలిపించాలి



మేనిఫెస్టో విడుద చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శనివారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎన్నికల మేనిఫెస్టోను మంత్రి విడుదల చేశారు. రాహుల్‌గాంధీ పర్యటనలో సింగరేణి కార్మికులతో గంటపాటు మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 20న జాతీయ కార్యదర్శి జి.సంజీవరెడ్డి పర్యటన కోల్‌బెల్ట్‌లో ఉంటుందని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, జాతీయ కార్యదర్శి చంద్రశేఖర్, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇంచార్జ్ వికాస్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంతోనే సంక్షేమం



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రామగిరి(మంథని): హెచ్‌ఎంఎస్‌తోనే కార్మికుల సంక్షేమం సాధ్యమని ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం ఆర్జీ–3లోని ఏఎల్‌పీ గనిలో రిలే–ఏ, సీ జరిగిన గేట్ మీటింగ్‌లో నాయన మాట్లాడారు. కార్మికుల సమస్యలే ఎజెండాగా హెచ్‌ఎంఎస్ ముందుకు సాగుతోందన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా కేవలం కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా హెచ్‌ఎంఎస్ కృషి చేస్తోందని అన్నారు. నాయకులు జక్కుల నారాయణ, ఉమామహేశ్వర్, బండారి క్రాంతికిరణ్, గోశిక అశోక్, అజ్మీర రంజిత్‌కుమార్, ఆర్.రాజశేఖర్, శాంతిస్వరూప్, సంతోష్, రామకృష్ణ, అనిల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీ సంఘాలను ఓడించాలి

గోదావరిఖని: ఎన్నికల్లో పైరవీ ఘాలను ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ కోరారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో లక్షా 60వేల మంది కార్మికులు ఉండగా నేడు 39వేలకు తగ్గిచారన్నారు. పాలకవర్గ పార్టీలు, అనుబంధ, ఎర్రజెండా పేరు చెప్పుకునే సంఘాల సంస్కరణవాద విధానాలే కారణమని ఆరోపించారు. ఎస్.మల్లేశ్, జి.నాగేశ్వరరావు, శంకర్, ఐ.సాంబయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

సీఐటీయూతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

రామగిరి(మంథని): కార్మికుల హక్కుల సాధన సీఐటీయూతోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శనివారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఐయూటీజిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు, ఆర్జీ–3 కార్యదర్శి దొమ్మటి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యావిధానం అమలు చేయిస్తాం
గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో సీఐటీయూని గెలిపిస్తే కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యావిధానం అమలు చేయిస్తామని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జీడీకే–1, 3, జీఎం ఆఫీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుణ్య నియాకాలతో యువ కార్మికుల సంఖ్య పెరుగుతోందన్నారు. వారిపిల్లల విద్య కోసం మూతపడిన సింగరేణి స్కూళ్లను తెరిపించి సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించేలా చూస్తామన్నారు. ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, వంగల రాములు, రాజేంద్రప్రసాద్, తిప్పారపు రాజు, దాసరి సురేశ్, సాయి కృష్ణ, సాగర్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కడదాకా పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం జీడీకే–1, 2ఏ, ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లుగా గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. యాజమాన్యానికి తొత్తుగా, సర్కారు అడుగులకు మడుగులొత్తుతూ కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. గ్రూప్ తగాదాలు, లంచగొండితనానికి పాల్పడిందని ధ్వజమెత్తారు. ఐఎన్‌టీయూసీ ఇన్నాళ్లూ నిద్రపోయి రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ప్రగల్భాలు పలుకుతోందన్నారు. ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల మధ్యనే ఉంటూ, వారి సేవకే అంకితమై పోరాడిందన్నారు. ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. నాయకులు ముస్కె సమ్మయ్య, మద్దె ఎల్లాగౌడ్, కవ్వంపెల్లి స్వామి, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, సంకే అశోక్, పెర్క మహేందర్, గౌస్, బోగ సతీశ్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.